RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 03 | సంచిక : 06 | 26 గురువారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

ఇసుక అక్రమ తవ్వకాలపై

చంద్రబాబు ఆగ్రహం

- పెన్నానదిలో అక్రమ తవ్వకాలపై అధికారుల నుంచి వివరణ
- తాగునీటి పైప్‌లైన్ ధ్వంసంపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం
- ట్రాక్టర్లు, యజమానులపై పోలీసులకు ఫిర్యాదు
- ఎఫ్ఐఆర్ నమోదు.. పైప్‌లైన్ మరమ్మతులతో నీటి సరఫరా పునరుద్ధరణ



అమరావతి, రాజధాని వాయిస్: : కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలోని పెన్నానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఈ వ్యవహారంపై మీడియాలో వచ్చిన కథనాలను పరిశీలించిన ఆయన, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా అధికారుల నుంచి సమగ్ర నివేదిక కోరింది. ప్రజలకు తాగునీరు అందించే పైప్‌లైన్‌కు నష్టం కలిగించడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. అక్రమ ఇసుక తవ్వకాలకు పాల్పడినా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా ఎవరినీ ఉపేక్షించవద్దని ముఖ్యమంత్రి కార్యాలయం జిల్లా కలెక్టర్‌కు స్పష్టం చేసింది. ఘటనకు బాధ్యులైన వారిపై తీసుకున్న చర్యలు, నమోదైన కేసుల వివరాలను నివేదించాలని కోరింది. ఈ ఆదేశాలపై స్పందించిన కడప జిల్లా కలెక్టర్, ఇప్పటివరకు జరిగిన పరిణామాలు, అధికారులు చేపట్టిన చర్యలతో కూడిన నివేదికను సీఎంవోకు సమర్పించారు.ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లి సమీపంలో పెన్నానదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించిన వెంటనే స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని అక్రమ తవ్వకాలను నిలిపివేశారు. ఇసుక రవాణాను కూడా పూర్తిగా అడ్డుకున్నట్లు నివేదికలో వివరించారు. ఈ ఘటనలో ఉపయోగించిన ట్రాక్టర్లు, వాటి యజమానులు, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాల్గొన్న వ్యక్తుల వివరాలను సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఈ వ్యవహారంపై పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. – 2లో..



యువతదే కీలక పాత్ర..

- విజ్ఞానం, సాంకేతికత, ఆవిష్కరణలపై చర్చ
- ఐఐటీ ఖరగ్‌పూర్ విద్యార్థులతో ప్రధాని మోదీ ముఖాముఖి

ఖరగ్‌పూర్, : ఐఐటీ ఖరగ్‌పూర్ 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన 75 మంది విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై దేశ భవిష్యత్తు, అభివృద్ధి లక్ష్యాలపై చర్చించారు. చారిత్రక సెనేట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఐటీ ఖరగ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సుమన్ చక్రవర్తి పాల్గొన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత పాత్రపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు విద్యార్థులు తమ ఆలోచనలు, ఆశయాలు, అభిప్రాయాలను ప్రధానమంత్రితో పంచుకున్నారు.విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక రంగాల్లో యువతకు ఉన్న అవకాశాలపై చర్చించారు. వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం, సమాజానికి ఉపయోగపడే సరికొత్త పరిష్కారాలను – 2లో..

కాకినాడ హార్బర్‌కు సురక్షితంగా చేరుకున్న మత్స్యకార బోటు 2

- ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటులోని ఏడుగురు క్షేమం
- సకాలంలో స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయం
- ఉప్పాడకు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ కోసం ముమ్మర గాలింపు
- కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక లేఖ.. బంగ్లాదేశ్, మయన్మార్ సహకారం కోరేందుకు చర్యలు
- మత్స్యకారుల ప్రాణరక్షణే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం
- రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఏపీ సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి

- నవంబర్ 23 నాటికి రూ.74,342 కోట్ల ఆదాయం
- గత ఏడాదితో పోలిస్తే అదనంగా రూ.11,738 కోట్లు
- పన్నేతర ఆదాయంలో 31.3 శాతం పెరుగుదల



అమరావతి, రాజధాని వాయిస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సొంత ఆదాయం గణనీయంగా పెరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆదాయార్జన శాఖలపై అమరావతిలో నిర్వహించిన సమీక్షలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నమోదైన ఆదాయ వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్పెషల్ మార్జిన్‌తో కలిపి నవంబర్ 23 నాటికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరినట్లు వెల్లడించారు. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.62,604 కోట్లతో పోలిస్తే రూ.11,738 కోట్లు అదనంగా సమకూరాయని, మొత్తం 18.7 శాతం వృద్ధి నమోదైందని తెలిపారు. వార్షిక లక్ష్యం రూ.1,27,506 కోట్లలో ఇప్పటికే 58 శాతం సాధించినట్లు వివరించారు. పన్నుల ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాదితో పోలిస్తే రూ.10,104 కోట్లు పెరిగి రూ.63,796 కోట్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. పన్నుల ఆదాయంలో 18.8 శాతం వృద్ధి నమోదుకాగా, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం పెరుగుదల కనిపించిందన్నారు. వాణిజ్య పన్నుల ఆదాయం 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్లకు చేరిందని, జీఎస్టీ ఆదాయం 18.1 శాతం పెరిగి రూ.3,694 కోట్ల మేర అదనంగా సమకూరినట్లు వివరించారు. స్పెషల్ మార్జిన్‌తో కలిపి ఎక్సైజ్ శాఖ ఆదాయం రూ.20,083 కోట్లకు చేరగా, గత ఏడాదితో పోలిస్తే రూ.3,287 కోట్ల మేర పెరిగిందని వెల్లడించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 16.6 శాతం వృద్ధితో రూ.8,020 కోట్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. వాహనాల కొనుగోలు, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే పన్నుల ఆదాయం 17.3 శాతం పెరిగి రూ.3,649 కోట్లకు చేరింది. గనులు, భూగర్భ శాఖ ఆదాయం 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు చేరగా, అటవీ శాఖ ఆదాయం 22.3 శాతం పెరిగి రూ.22 కోట్లుగా నమోదైంది. పన్నేతర ఆదాయం గత ఏడాది రూ.1,330 కోట్ల నుంచి ఈ ఏడాది రూ.2,091 కోట్లకు పెరిగినట్లు వివరించారు. – 2లో..

నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలకు చంద్రబాబుకు ఆహ్వానం



అమరావతి, రాజధాని వాయిస్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో డిసెంబరు 19, 20 తేదీల్లో నిర్వహించనున్న నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలను ప్రారంభించాలని ముఖ్య మంత్రి చంద్రబాబును ఆహ్వానించినట్లు పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాష చరిత్రలో మొదటిసారి గా 16ఏళ్ల బాలల కోసం.. బాలల చేత నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక తెలుగు మహాసభలు అని, తెలుగు భాషలోని అన్ని ప్రక్రియలపై బాల బాలికలు తమ ప్రతిభను చూపిస్తున్నారని ముఖ్యమంత్రికి వివరించినట్లు గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఒంగోలులోని నంద మూరి తారక రామారావు కళా ప్రాంగణంలో.. టంగుటూరి ప్రకాశం పంతులు ప్రధాన వేదికపై నిర్వహిస్తున్న ఈ మహా సభలకు 30 దేశాల నుంచి ప్రతినిధులు, తమ తల్లిదండ్రులతో పాటుగా పాల్గొంటారని తెలిపారు. తమ అభ్యర్థనకు ముఖ్యమ ంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. సీఎంను కలిసిన వారిలో మహాసభల ముఖ్య సమన్వయకర్తలు కె.మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్, ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామచంద్రరాజు ఉన్నారు.

వ్యక్తిత్వ హననంపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

- కోట రుక్మిణిని కించపరిచేలా వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఫిర్యాదు
- వైసీపీ అధికార ప్రతినిధి, మీడియా సంస్థపై ఆరోపణలు
- మహిళల ప్రతిష్ఠకు భంగం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- న్యాయవాదులు, జనసేన మహిళా నేతల బృందం వినతి



అమరావతి, రాజధాని వాయిస్: జనసేన పార్టీ ప్రెసిడెంట్ సెక్రటేరియట్‌లో చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న కోట రుక్మిణిపై వ్యక్తిగతంగా, వ్యాపారపరంగా కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు న్యాయవాదులు, జనసేన మహిళా నాయకులు రాష్ట్ర మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఫిర్యాదు అందజేశారు. – 2లో..

వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి బెయిల్ నిరాకరణ



గుంటూరు, రాజధాని వాయిస్: వైకాపా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి గుంటూరు రెండో అదనపు జిల్లా కోర్టు బెయిల్ నిరాకరించింది. ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత.. గుంటూరు జిల్లా వెంగళా యపాలెం నుంచి స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న బ్యాలెట్ బాక్సును ఆయన నల్లపాడు సెంటర్‌లో అడ్డుకున్నారు. దీంతో అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై నల్లపాడు పోలీసులు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రస్తుతం రాజమహేంద్రవరం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. బెయిల్ ఇవ్వాలని కోరుతూ అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై గుంటూరు రెండో అదనపు జిల్లా కోర్టులో విచారణ జరిగింది. తీవ్రమైన నేరం కావటం, కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం అప్పిరెడ్డి బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

కార్యకర్తలే పార్టీకి అసలైన బలం: నారా లోకేశ్

- మైటీడీపీ యాప్‌లో 10 లక్షల మంది సభ్యులు
- కార్యకర్తల సేవలకు గుర్తింపు కల్పించడమే లక్ష్యం
- పార్టీకి, శ్రేణులకు డిజిటల్ వారధిగా యాప్



అమరావతి, రాజధాని వాయిస్: తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం, బలగమని ఏపీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీకి, కార్యకర్తలకు మధ్య డిజిటల్ వారధిగా రూపొందించిన మైటీడీపీ యాప్‌లో నమోదైన సభ్యుల సంఖ్య 10 లక్షలకు చేరుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ మైలురాయిని చేరుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు సామాజిక మాధ్యమం ద్వారా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. – 2లో..

యువతదే కీలక పాత్ర..



ఆవిష్కరించడం వంటి అంశాల ప్రాధాన్యతను ఈ సమావేశం చాటిచెప్పింది. విద్యాసంస్థలు కేవలం విద్య, పట్టాలకే పరిమితం కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, నూతన పారిశ్రామిక ఆలోచనలకు కేంద్రాలుగా ఎదగాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. యువతలోని సృజనాత్మకత, ప్రతిభను దేశ అభివృద్ధికి అనుసంధానించడం ద్వారా ప్రపంచ స్థాయిలో భారత్ మరింత బలంగా ఎదిగే అవకాశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత సాంకేతిక విద్యారంగంలో విశేష గుర్తింపు పొందిన ఐఐటీ ఖరగ్‌పూర్ 75 ఏళ్ల ప్రస్థానాన్ని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విద్య, పరిశోధన, సాంకేతిక అభివృద్ధి ద్వారా దేశ నిర్మాణానికి సంస్థ అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులోనూ ప్రపంచస్థాయి పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలకు ఐఐటీ ఖరగ్‌పూర్ మరింతగా దోహదపడాలని ఆకాంక్షించారు. ప్రధాని మోదీతో 75 మంది విద్యార్థులు నిర్వహించిన ఈ ముఖాముఖి సమావేశం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత ఆలోచనలు, ఆవిష్కరణలు, పరిశోధనలే వికసిత్ భారత్--2047 నిర్మాణానికి కీలక పునాదులనే సందేశం ఈ కార్యక్రమం ద్వారా ప్రస్ఫుటమైంది.

ఇసుక అక్రమ తవ్వకాలపై చంద్రబాబు ఆగ్రహం



ముఖ్యంగా తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసిన వారితో పాటు ట్రాక్టర్ యజమానులపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఘటనలో బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన వాహనాలు, వాటి యజమానుల వివరాలు కూడా పోలీసుల దర్యాప్తులో కీలకంగా మారాయి. ధ్వంసమైన తాగునీటి పైప్‌లైన్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు కలెక్టర్ నివేదికలో పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. అక్రమ ఇసుక తవ్వకాల నియంత్రణతో పాటు ప్రజలకు అవసరమైన తాగునీటి సరఫరా వ్యవస్థకు రక్షణ కల్పించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

మచిలీపట్నంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు



మచిలీపట్నం, రాజధాని వాయిస్: మచిలీపట్నం నగరంలో తాగునీటి సరఫరా, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో పబ్లిక్ హెల్త్, మున్సిపల్ శాఖల అధికారులు, మెగా కాంట్రాక్టర్ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, మౌలిక సదుపాయాల పనుల పురోగతిపై చర్చించారు. సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నగరంలో ప్రస్తుతం ఉన్న నీటి పంపిణీ వ్యవస్థలోని లోటుపాట్లను సరిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. రీ-జోనింగ్ విధానం ద్వారా నీటి పంపిణీని క్రమబద్ధీకరించి, సరఫరా వ్యవస్థపై ఒత్తిడి తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని ఆరు రిజర్వాయర్లకు నిరంతరాయంగా నీరు చేరేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రిజర్వాయర్ల సామర్థ్యం, నీటి సరఫరా మార్గాల్లో ఉన్న సమస్యలను పరిశీలించి తగిన మార్పులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. పైపులైన్లలో ఏర్పడుతున్న లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో సమస్యల కారణంగా రిజర్వాయర్లకు నీరు చేరడం, పంపిణీ ప్రక్రియకు ఆటంకం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. నగరంలోని డ్రైనేజీ సమస్యలకు తాత్కాలిక చర్యలతో కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటికే చేపట్టిన మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. నగర అవసరాలు, భవిష్యత్తులో పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకొని మురుగునీటి నిర్వహణ వ్యవస్థను మెరుగు పరచాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షిస్తూ, కాంట్రాక్టర్ ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పనుల్లో జాప్యం జరగకుండా పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఏపీ సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి



స్థానిక సంస్థల ఆదాయ వివరాలను కూడా అధికారులు సమీక్షలో వెల్లడించారు. ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు గ్రామ పంచాయతీల పన్ను ఆదాయం రూ.238 కోట్లకు చేరిందని తెలిపారు. ఇదే ఏడాది నవంబర్ 20 నాటికి పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లు రూ.2,365 కోట్లుగా నమోదైనట్లు వివరించారు. ఆదాయ వృద్ధికి ప్రభుత్వ నిర్ణయాలు, శాఖల్లో చేపట్టిన సంస్కరణలు, పారదర్శక విధానాలు, ఆన్‌లైన్ సేవలు దోహదపడుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ప్రభుత్వ చర్యల వల్ల ఆదాయ లీకేజీలు తగ్గుతున్నాయని, వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడం ద్వారా వివిధ శాఖల్లో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు ప్రభుత్వ ఆదాయంలోనూ ప్రతిబింబించాలని సూచించారు. ప్రజలపై పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండా ప్రభుత్వ శాఖల్లో ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. పారదర్శకత, సాంకేతిక పరిజ్ఞానం, సమర్థవంతమైన పర్యవేక్షణ ద్వారా ఆదాయ వనరులను మెరుగుపరచాలని స్పష్టం చేశారు. ఆదాయ వసూళ్లలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్ల కోసం కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థను వినియోగిస్తున్నట్లు అధికారులు వివరించారు. వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ ఆధారిత వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, న్యాయపరమైన వ్యవహారాల్లోనూ ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. సమీక్షకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు--రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

వ్యక్తిత్వ హననంపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

రాష్ట్రంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన నకిలీ ఉద్యోగాల ముఠా వ్యవహారాన్ని కోట రుక్మిణి బయటపెట్టి, మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఫిర్యాదుదారులు తెలిపారు. ఈ పరిణామాల అనంతరం ఆమెను లక్ష్యంగా చేసుకుని వైసీపీ అధికార ప్రతినిధి యనమల, సాక్షి న్యూస్ సంస్థతో పాటు కొందరు సామాజిక మాధ్యమ కార్యకర్తలు వ్యక్తిగత, వ్యాపార సంబంధిత అంశాలపై కించపరిచే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మహిళలను లక్ష్యంగా చేసుకుని వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరికాదని, ఇటువంటి చర్యలను అరికట్టేందుకు మహిళా కమిషన్ జోక్యం చేసుకోవాలని కోరారు. బాధ్యులుగా పేర్కొన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదు అందజేసిన వారిలో హైకోర్టు న్యాయవాదులు పొన్నూరు సాయి శిరీష, నాగలతతో పాటు జనసేన మహిళా నాయకులు ఉన్నారు. కాకినాడ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బుర్ర దివ్యా రాజ్, పెద్దిశెట్టి ఉషశ్రీ, తుమ్మి లక్ష్మీ రాజ్ కూడా ఈ బృందంలో పాల్గొన్నారు. జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధులు పగడాల



శివపార్వతి, రాయపాటి అరుణతో పాటు నాగలక్ష్మి, కస్తూరి తేజస్వి, దామచర్ల స్వాతి లక్ష్మీ, తిరగతి ఆదిత్య తదితరులు మహిళా కమిషన్‌కు ఫిర్యాదు అందజేసిన వారిలో ఉన్నారు. ఈ వ్యవహారంపై కమిషన్ స్పందించి మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హనన చర్యలపై తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కార్యకర్తలే పార్టీకి అసలైన బలం: నారా లోకేశ్

కార్యకర్తే అధినేత అనే భావనతో పార్టీ ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కార్యకర్తలు పడుతున్న ప్రతి కష్టానికి తగిన గుర్తింపు లభించాలన్నదే మైటీడీపీ యాప్ రూపకల్పన వెనుక ప్రధాన ఉద్దేశమని లోకేశ్ వివరించారు. ప్రతి కార్యకర్త అభిప్రాయానికి విలువ ఉండాలని, పార్టీ కోసం నిరంతరం శ్రమించే వారికి సముచిత అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఈ వేదికను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ ప్రయాణంలో భాగస్వాములైన 10 లక్షల మంది తెలుగుదేశం కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యకర్తల భాగస్వామ్యం మరింత పెరిగితే పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మైటీడీపీ యాప్ ప్రాంతీయ పార్టీల డిజిటల్ నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు పొందిన వేదికగా నిలిచిందని టీడీపీ తన ప్రకటనలో వెల్లడించింది. నారా లోకేశ్ ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ఈ యాప్ ద్వారా గ్రామాలు, వార్డుల స్థాయిలో పనిచేసే కార్యకర్తల వివరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. ఇంటింటి ప్రచారం, పార్టీ కార్యక్రమాలు, ప్రజాసేవా కార్యక్రమాలు వంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారు తమ సేవల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరచవచ్చు. దీంతో క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేస్తున్న పనిని పార్టీ వ్యవస్థాగతంగా గుర్తించే అవకాశం ఏర్పడిందని పార్టీ తెలిపింది. యాప్‌లో నమోదయ్యే వివరాల ఆధారంగా కార్యకర్తల పనితీరును పరిశీలించి, పార్టీ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థిత్వాలు, నామినేటెడ్ పదవుల కేటాయింపులో ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు టీడీపీ వెల్లడించింది. పార్టీ కోసం పనిచేసిన వారి సేవలను గుర్తించి అవకాశాలు కల్పించేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని పేర్కొంది. పార్టీ నాయకత్వం నుంచి వచ్చే సందేశాలు, ముఖ్యమైన మార్గదర్శకాలను కార్యకర్తలకు వేగంగా చేరవేయడంతో పాటు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అగ్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా యాప్ ఉపయోగపడుతోందని వివరించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని పార్టీ సంస్థాగత కార్యకలాపాలకు అనుసంధానించడం ద్వారా నాయకత్వానికి, కార్యకర్తలకు మధ్య సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నది మైటీడీపీ లక్ష్యంగా కనిపిస్తోంది. పది లక్షల మంది సభ్యుల నమోదు ఈ వేదికకు లభిస్తున్న స్పందనను తెలియజేస్తోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఈ డిజిటల్ వేదిక ద్వారా కార్యకర్తలకు అందించే గుర్తింపు, అవకాశాలు పారదర్శకంగా అమలైతే పార్టీ క్షేత్రస్థాయి వ్యవస్థకు మరింత ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.

కాకినాడ హార్బర్‌కు సురక్షితంగా చేరుకున్న మత్స్యకార బోటు

అమరావతి, రాజధాని వాయిస్: కాకినాడ జిల్లా యేటిమొగ నుంచి చేపల వేటకు వెళ్లి ఇంజిన్ వైఫల్యంతో సముద్రంలో నిలిచిపోయిన బోటు సురక్షితంగా కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చేరుకోవడం సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డ్రైవర్‌తో సహా ఏడుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావడం వారి కుటుంబ సభ్యులకు ఎంతో ఊరటనిచ్చిందన్నారు. యేటిమొగకు చెందిన సెరు రామలక్ష్మి పేరుతో నమోదైన యాంత్రిక మత్స్యకార బోటు (IND-AP-E2-MM-220) ఈ నెల 23వ తేదీ రాత్రి ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఉప్పాడ--తుని తీరంలోని కృష్ణాపురం సమీపంలో నిలిచిపోయిందని వివరించారు. తీరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోటు నుంచి డ్రైవర్ దమ్ము అప్పారావు సమాచారం అందించడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారన్నారు. అత్యవసర ఫోన్ కాల్ అందిన వెంటనే స్పందించిన అధికారుల పనితీరు అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలోనూ వాకలపూడి ఇన్‌స్పెక్టర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా కోస్ట్‌గార్డ్, నౌకాదళ అధికారులకు సమాచారం చేరవేయడంతో పాటు మత్స్యశాఖతో సమన్వయం చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. సముద్రపు నీటి లోతు తక్కువగా ఉండటంతో భారీ నౌకల రాకకు ఇబ్బందులు ఎదురైనప్పటికీ, బోట్ల యజమానుల సంఘం సహకారంతో సహాయక ప్రయత్నాలు చేపట్టారని వివరించారు. ఈ నేపథ్యంలో వేగంగా స్పందించిన కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు, సంబంధిత సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఏడుగురి కోసం ముమ్మర గాలింపు

మరోవైపు కాకినాడ జిల్లా ఉప్పాడలోని సుబ్బంపేటకు చెందిన ఏడుగురు మత్స్యకారులు సముద్రంలో గల్లంతైన ఘటనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 4న రెండు బోట్లలో పారాదీప్ వైపు చేపల వేటకు వెళ్లగా, ఒక బోటు 18న తిరిగి వచ్చిందన్నారు. మరో బోటులోని మత్స్యకారుల ఆచూకీ లభించకపోవడంతో 19న ఫిర్యాదు అందిందని, అప్పటి నుంచి సంబంధిత శాఖల సమన్వయంతో గాలింపు కొనసాగుతోందని వివరించారు. గల్లంతైన మత్స్యకారుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశామని మంత్రి తెలిపారు. వారి ఆచూకీ గుర్తించేందుకు అవసరమైన సహకారం కోరడంతో పాటు బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల సముద్ర జలాల వైపు వెళ్లి ఉండే అవకాశాలను కూడా పరిశీలిస్తామన్నారు. కేంద్ర విదేశాంగ శాఖ ద్వారా ఆయా దేశాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. భారత తీర రక్షక దళం, నౌకాదళం, ఒడిశా అధికారులు, రాష్ట్ర మత్స్యశాఖ సమన్వయంతో గాలింపును మరింత వేగవంతం చేయాలని సూచించారు. మత్స్యకారుల



భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని మంత్రి స్పష్టం చేశారు. చేపల వేటకు వెళ్లే ముందు బోట్ల ఇంజిన్లు, ట్రాన్స్‌పాండర్లు, సమాచార వ్యవస్థలు, ఇతర రక్షణ పరికరాలను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించేలా అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్స్యకారుల ప్రాణరక్షణే కూటమి ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. ఒక బోటులోని ఏడుగురు క్షేమంగా తిరిగి రావడం సంతోషకరం. గల్లంతైన మరో ఏడుగురిని కూడా సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రయత్నాలు చేస్తాం. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలి. ప్రభుత్వం వారికి అండగా ఉంటుంది అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.

జాతీయ ప్రాజెక్టులను గడువులోగా పూర్తి చేయాలి

రాష్ట్రాల సీఎస్‌లకు ప్రధాని మోదీ ఆదేశాలు.. పీఎం-సేతు అమలుపై సమీక్ష



అమరావతి, రాజధాని వాయిస్: దేశవ్యాప్తంగా ప్రగతి కార్యక్రమం కింద చేపట్టిన జాతీయ ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఢిల్లీ నుంచి వివిధ రాష్ట్రాల సీఎస్‌లతో వీడియో సమావేశం నిర్వహించిన ఆయన ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు. పీఎం-సేతు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించాలని, ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలని సూచించారు. పీఎం-సేతు పథకం కింద దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను రూ.60 వేల కోట్లతో ఆధునికీకరించనున్నారు. హబ్ అండ్ స్పోక్ విధానంలో 200 ఐటీఐలను ప్రధాన కేంద్రాలుగా, మరో 800 ఐటీఐలను అనుబంధ కేంద్రాలుగా అభివృద్ధి చేస్తారు. పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టి, ప్రాక్టికల్ శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. ఈ పథకం కింద దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఐటీఐ క్లస్టర్ ఆధునికీకరణకు ఆమోదం లభించింది. ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ భాగస్వామ్యంతో రూ.200 కోట్లతో నాలుగు ప్రభుత్వ ఐటీఐలను అభివృద్ధి చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 83 ఐటీఐలను ఆధునిక క్లస్టర్లుగా తీర్చిదిద్దనున్నారు. ఈ సమావేశంలో ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, పీఎం ప్రగతి రాష్ట్ర నోడల్ అధికారి కోన శశిధర్, నైపుణ్యాభివృద్ధి శాఖ డైరెక్టర్ జి.గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

- మున్సిపల్ స్టేడియంలోని పంపిణీ కేంద్రంలో తనిఖీ
- పోలింగ్ సామగ్రి, సిబ్బంది సౌకర్యాలపై సమీక్ష
- రవాణా, స్ట్రాంగ్ రూమ్ భద్రతపై పరిశీలన
- ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, బృందాల పంపిణీపై దృష్టి



నరసరావుపేట, రాజధాని వాయిస్: : పల్నాడు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లా బుధవారం నరసరావుపేట మున్సిపల్ స్టేడియంలోని పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు తదితర అంశాలపై దృష్టి సారించారు.పంపిణీ కేంద్రంలో అందుబాటులో ఉంచిన పోలింగ్ సామగ్రిని కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బందికి కల్పించిన సౌకర్యాలను కూడా సమీక్షించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు, విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలను తనిఖీ చేశారు. ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ బృందాల రవాణా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, బృందాలను సకాలంలో పంపించేందుకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ బృందాలు తమకు కేటాయించిన ప్రాంతాలకు వెళ్లే ప్రక్రియలో రవాణా ఏర్పాట్లు కీలకంగా ఉండటంతో ఈ అంశాన్ని తనిఖీ చేశారు.స్ట్రాంగ్ రూమ్ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను కూడా డాక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో మరో కీలక దశ అయిన ఓట్ల లెక్కింపు నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్ భద్రత, లెక్కింపు ఏర్పాట్లకు సంబంధించిన అంశాలను తనిఖీ చేయడం ద్వారా ఎన్నికల నిర్వహణలోని వివిధ దశలపై దృష్టి సారించారు. పోలింగ్ బృందాలను నిర్దేశిత సమయంలో పంపించేలా ఏర్పాట్లు, సామగ్రి పంపిణీ, సిబ్బంది సౌకర్యాలు, రవాణా, భద్రత, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. నరసరావుపేట మున్సిపల్ స్టేడియంలోని పంపిణీ కేంద్రంలో ఈ అంశాలన్నింటినీ సమగ్రంగా సమీక్షించినట్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వెల్లడించింది.

ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి



కాకినాడ, రాజధాని వాయిస్: : ఓటు వేయడం ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కాకినాడ నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో జరగనున్న ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు వేర్వేరు పోలింగ్ సమయాలు ఉన్నందున ఓటర్లు తమ ప్రాంతానికి వర్తించే సమయాన్ని ముందుగానే తెలుసుకోవాలని సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ సమయాన్ని దృష్టిలో ఉంచుకుని తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని కోరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటు వేసేందుకు అవకాశం ఉన్నందున తమకు అనుకూలమైన సమయంలో కేంద్రానికి చేరుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఇక కాకినాడ రూరల్, కరప, తాళ్లరేవు, పెద్దాపురం, సామర్లకోట మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ ఓటర్లకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పోలింగ్ సమయం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మండలాల్లోని గ్రామాల ఓటర్లు మధ్యాహ్నం 1 గంటలోపే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ పోలింగ్ సమయంతో పోలిస్తే గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ సమయం ముందుగానే ముగియనుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు ప్రత్యేకంగా ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఓటర్లు తమ నివాస ప్రాంతం ఏ పరిధిలోకి వస్తుందో తెలుసుకుని, దానికి అనుగుణంగా పోలింగ్ సమయాన్ని గుర్తుంచుకోవాలని కలెక్టర్ సూచించారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో సాయంత్రం 5 గంటల వరకు, కాకినాడ రూరల్, కరప, తాళ్లరేవు, పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు. సమయ పరిమితిని దృష్టిలో ఉంచుకుని ఓటర్లు ముందుగానే పోలింగ్ కేంద్రాలకు వెళ్లేలా ప్రణాళిక చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఓటరు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం ఉండాలంటే అర్హులైన ఓటర్లు తమ ఓటును తప్పనిసరిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఓటర్లతో పాటు పేర్కొన్న ఐదు మండలాల గ్రామ పంచాయతీ ఓటర్లు కూడా తమకు వర్తించే సమయాల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని కోరారు.

కంచల సర్పంచ్ అభ్యర్థిగా రామిరెడ్డి సుబ్బారావుకు కూటమి మద్దతు



నందిగామ, రాజధాని వాయిస్: నందిగామ మండలం కంచల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రామిరెడ్డి సుబ్బారావుకు గ్రామ ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. కూటమి తరఫున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుబ్బారావును ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కంచల గ్రామంలో సర్పంచ్ పదవికి తెలుగుదేశం పార్టీ తరఫున రామిరెడ్డి సుబ్బారావు అభ్యర్థిగా నిలిచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనకు కూటమి మద్దతు ఉందని స్పష్టం చేస్తూ, గ్రామ ప్రజలు అభ్యర్థికి అండగా నిలవాలని కోరారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని గ్రామ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునే సమయంలో రామిరెడ్డి సుబ్బారావుకు ప్రాధాన్యత ఇవ్వాలని తంగిరాల సౌమ్య కోరారు. సర్పంచ్ ఎన్నికల్లో ఆయనకు మద్దతు తెలిపి గెలిపించడం ద్వారా కూటమి అభ్యర్థికి బలం చేకూర్చాలని పేర్కొన్నారు. గ్రామ ఓటర్లు తమ అమూల్యమైన ఓటుతో అభ్యర్థిని ఆదరించాలని పిలుపునిచ్చారు. కంచల గ్రామంలో సర్పంచ్ పదవికి జరుగుతున్న ఎన్నికల్లో కూటమి తరఫున తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా సుబ్బారావు బరిలో ఉన్నారని ఎమ్మెల్యే వివరించారు. ఆయనకు గ్రామ ప్రజల మద్దతు అవసరమని పేర్కొంటూ, ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించాలని కోరారు. అభ్యర్థిని గెలిపించేందుకు ఓటర్లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి బలపరిచిన అభ్యర్థిగా రామిరెడ్డి సుబ్బారావుకు మద్దతు ప్రకటించిన తంగిరాల సౌమ్య, కంచల గ్రామ ప్రజలు తమ ఓటుతో ఆయనను ఆదరించాలని మరోసారి కోరారు. నందిగామ మండలంలోని కంచల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో సుబ్బారావుకు భారీ మెజారిటీతో విజయాన్ని అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట పోలీస్ బందోబస్తు

అనకాపల్లి, రాజధాని వాయిస్: జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. గురువారం ఎనిమిది మండలాల్లో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తున్నట్లు భరోసా ఇచ్చారు.ఎన్నికల బందోబస్తులో భాగంగా పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక బ్రీఫింగ్ సమావేశం నిర్వహించారు. ఈ పాఠశాల బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రంగా ఉండటంతో అక్కడ విధులకు హాజరైన సిబ్బందికి ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధి నిర్వహణలో పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలను మోహరించినట్లు ఎస్పీ తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు రూట్ మొబైల్స్, స్టైకింగ్ ఫోర్స్‌తోపాటు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పోలింగ్ సమయంలో ఎక్కడైనా సమస్యలు తలెత్తకుండా ముందస్తు నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా వినియోగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, పోలీసు సిబ్బంది ధరించే బాడీ వోర్న్ కెమెరాలు, వీడియోగ్రఫీ, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా ఓటు వేయాలని, ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహనరావు, సీఐలు భాస్కరరావు, చంద్రశేఖర్, ధనుంజయ రావుతోపాటు ఇతర సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

విజయనగరంలో డిసెంబర్ 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్ పోటీలు



విజయనగరం, రాజధాని వాయిస్: దివ్యాంగ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రోత్సహించే లక్ష్యంతో విజయనగరంలో రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. డిసెంబర్ 1, 2 తేదీల్లో రెండు రోజులపాటు ఈ పోటీలు జరగనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. క్రీడలపై ఆసక్తి, ప్రతిభ ఉన్న దివ్యాంగులకు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు ఈ ఛాంపియన్‌షిప్ వేదికగా నిలవనుంది. ఈ పోటీల్లో పాల్గొనేందుకు 13 ఏళ్లు పైబడిన అర్హులైన క్రీడాకారులకు అవకాశం కల్పించనున్నారు. వయసు అర్హత కలిగిన వారు నిర్ణయించిన నిబంధనల ప్రకారం పోటీల్లో పాల్గొనవచ్చని కలెక్టర్ వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న ప్రతిభావంతులైన దివ్యాంగ క్రీడాకారులను గుర్తించి, వారికి క్రీడా రంగంలో మరిన్ని అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్‌లో మొత్తం ఆరు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ విభాగాల్లో పాల్గొనే క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుంది. పోటీల ద్వారా క్రీడాకారుల ప్రతిభను గుర్తించి, వారికి తగిన ప్రోత్సాహం అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.దివ్యాంగులు కూడా క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకునే సామర్థ్యం కలిగి ఉన్నారనే విషయాన్ని గుర్తిస్తూ, వారికి సరైన వేదికలు కల్పించడం ఈ ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశంగా ఉంది. జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అర్హులైన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనేలా అవకాశం కల్పించనున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి భవిష్యత్తులో ఉన్నత స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే దిశగా ప్రోత్సాహం లభించనుంది. డిసెంబర్ 1, 2 తేదీల్లో విజయనగరంలో జరిగే ఈ రాష్ట్రస్థాయి పారాస్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో అర్హులైన క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరు విభాగాల్లో నిర్వహించనున్న పోటీల ద్వారా మరింత మంది దివ్యాంగ క్రీడాకారులను గుర్తించి, రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులే లక్ష్యంగా 'ఖేతి రక్షక్ నెట్ హౌస్'



విజయనగరం, రాజధాని వాయిస్: తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో అమలు చేస్తున్న 'ఖేతి రక్షక్ నెట్ హౌస్' కూరగాయల సాగు విధానాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామంలో నాబార్డు ఆర్థిక సహకారంతో చేపడుతున్న ఈ సాగు విధానాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. నెట్ హౌస్ పద్ధతిలో కూరగాయల సాగు ఎలా కొనసాగుతోందో పరిశీలించారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితో మెరుగైన దిగుబడులు సాధించే విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నాబార్డు ఆర్థిక సహకారంతో అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని నాలుగు మండలాలకు చెందిన రైతులను ఎంపిక చేశారు. ఎంపికైన రైతులు ఈ సాగు విధానాన్ని అనుసరించి కూరగాయల ఉత్పత్తి చేపట్టేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రాజెక్టు అమలులో భాగంగా మొత్తం 60 మంది రైతులను ఎంపిక చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వీరిలో 38 మంది ఇప్పటికే నెట్ హౌస్ విధానంలో కూరగాయల సాగు ప్రారంభించినట్లు తెలిపారు. మిగిలిన రైతుల వివరాలు, ప్రాజెక్టు పురోగతికి సంబంధించిన అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు.తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేందుకు ఉద్దేశించిన ఈ విధానం ద్వారా రైతులకు సాగులో ప్రత్యామ్నాయ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. నెట్ హౌస్ పద్ధతిలో సాగు చేపట్టిన రైతుల క్షేత్రాలను పరిశీలించడం ద్వారా ప్రాజెక్టు అమలు తీరును అధికారులు పర్యవేక్షిస్తున్నారు. రైతులు ఈ విధానాన్ని ఎలా వినియోగించుకుంటున్నారనే అంశాలను కూడా కలెక్టర్ తెలుసుకున్నారు. పెదకాద గ్రామంలో పర్యటించిన కలెక్టర్ 'ఖేతి రక్షక్ నెట్ హౌస్' ప్రాజెక్టు పురోగతిని సమీక్షించారు. నాలుగు మండలాల్లో ఎంపిక చేసిన 60 మంది రైతుల్లో ఇప్పటికే 38 మంది సాగు ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. నాబార్డు సహకారంతో అమలవుతున్న ఈ కార్యక్రమం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే సాగు విధానాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

ఈవీఎం గోడౌన్ భద్రతపై కలెక్టర్ ప్రత్యేక తనిఖీ



గుంటూరు, రాజధాని వాయిస్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. యంత్రాలను భద్రపరిచిన గదుల వద్ద ఉన్న భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈవీఎంలు భద్రపరిచిన గదుల భద్రత, సీసీ కెమెరాల పనితీరును కలెక్టర్ పరిశీలించారు. గదులకు ఏర్పాటు చేసిన తాళాలు, సీళ్లను తనిఖీ చేశారు. భద్రతా వ్యవస్థ నిరంతరం సక్రమంగా పనిచేస్తుండాలని, యంత్రాల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం గోడౌన్ భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. గోడౌన్ పరిసరాలు, భద్రతా గదులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండటంతోపాటు భద్రతా ఏర్పాట్లలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే సరిదిద్దాలని సూచించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలు, పర్యవేక్షణకు సంబంధించిన వివరాలు నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. భద్రతా చర్యల అమలులో పారదర్శకత, క్రమబద్ధత పాటించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, సహాయ జిల్లా విపత్తులు, అగ్నిమాపక శాఖ అధికారి కె. కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈవీఎం గోడౌన్‌లో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్.. యంత్రాల భద్రత, పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

తొలి విడత పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- ఎనిమిది మండలాల్లో ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు
- 221 గ్రామ పంచాయతీల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు
- 2,108 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు - 2,148 పోలింగ్ కేంద్రాలు సిద్ధం



విజయనగరం, రాజధాని వాయిస్: విజయనగరం జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ఎన్నికలను నిర్వహించేందుకు అవసరమైన సన్నాహాలను పూర్తి చేసినట్లు వెల్లడించారు. నిర్దేశించిన గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. తొలి విడతలో జిల్లాలోని ఎనిమిది మండలాల పరిధిలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల్లో మొత్తం 221 గ్రామ పంచాయతీలను ఎన్నికల ప్రక్రియ పరిధిలోకి తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో ఓటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.ఈ విడతలో 2,108 వార్డు సభ్యుల స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీలతో పాటు వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధమయ్యారు. మొత్తం స్థానాలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల కోసం జిల్లాలో మొత్తం 2,148 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. ఎనిమిది మండలాల్లోని గ్రామ పంచాయతీలు, వార్డు సభ్యుల స్థానాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని కలెక్టర్ స్పష్టం చేశారు. తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 221 గ్రామ పంచాయతీలు, 2,108 వార్డు సభ్యుల స్థానాలు, 2,148 పోలింగ్ కేంద్రాలతో జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఉత్తమ గ్రామ పంచాయితీగా నకరికల్లును తీర్చిదిద్దుతాం

సర్పంచ్ తిరువీధుల శ్రీనివాసరావు
ఉప సర్పంచ్ ఢీకొండ ఆదినారాయణ

నకరికల్లు.నవంబర్ 25 రాజధాని వాయిస్: పల్నాడు జిల్లా,సత్తెనపల్లి నియోజకవర్గం,నకరికల్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తిరువీధుల శ్రీనివాసరావు,ఉప సర్పంచ్ గా ఢీకొండ ఆదినారాయణ,16 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అన్నపూర్ణ తెలిపారు.ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ఏకగ్రీవంగా అయినట్లు ధృవీకరణ పత్రాలు అందించారు.సర్పంచ్,వైస్ ప్రెసిడెంట్,వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామ ప్రజలకు,సహకరించిన అధికారులకు, నాయకులకూ సర్పంచ్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయితీకి 50 లక్షలు ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందని, దీనిని గ్రామభివృద్ధికి ఖర్చు పెట్టడం జరుగుతుందని,ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు,మాజీమంత్రి,సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మినారాయణ,జడ్పీటీసీ డాక్టర్ నాగోతు వెంకట సరోజ,ఎంపీపీ బత్తుల అప్పారావు,రాష్ట్ర టిడిపి కార్యనిర్వహక కార్యదర్శి నాగోతు శౌరయ్య సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసి ఉత్తమ పంచాయితీగా నకరికల్లును తీర్చిదిద్దుతామని,ప్రజలకు ఏ సమస్య



వచ్చిన ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ నుంచి తాగునీటి విడుదల

కాలువల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
నేడు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నీటి విడుదల
పశువులను కాలువల్లోకి తీసుకెళ్లొద్దు.
పిల్లలను ఈతకు అనుమతించొద్దు
మాచర్ల మండల గ్రామ ప్రజలకు అధికారుల హెచ్చరిక

మాచర్ల.నవంబర్ 25 రాజధాని వాయిస్ : నాగార్జునసాగర్ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో మాచర్ల మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కారణంగా కాలువల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.ఈ సందర్భంగా పశువులను కాలువల్లోకి తీసుకెళ్లరాదని, పిల్లలను ఈతకు పంపించరాదని, మోటార్ల ద్వారా పైపులు వేసి పంట పొలాలకు నీటిని తరలించరాదని అధికారులు స్పష్టం చేశారు. అలాగే ఇతర అవసరాల నిమిత్తం ఎవరూ కాలువల వద్దకు వెళ్లరాదని



హెచ్చరించారు.ఈ విషయాన్ని ప్రతి గ్రామంలో గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా దండోరా వేయించి ప్రజలకు తెలియజేసినట్లు వెల్లడించారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. ఈ సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సంబంధిత అధికారులు విజ్ఞప్తి చేశారు.

వరిపంట కోత ప్రయోగం నిర్వహించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రాజుపాలెం.నవంబర్ 25రాజధాని వాయిస్: మండలంలోని పెదనెమలిపురి గ్రామంలో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి పంట కోత ప్రయోగం నిర్వహించడం జరిగింది. 5 ఇ 5 మీటర్లు (25 చ.మీ) విస్తీర్ణం ప్లాట్ లో కోత చేసిన వరి ధాన్యం 17.150 కిలోలు వచ్చింది. దీని ప్రకారం ఎకరాకు దిగుబడి 36 బస్తాలుగా నిర్ణయించడం జరిగింది.ఈ కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు హాజరై కోత ప్రయోగాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, పంట బీమా పథకం వల్ల కలిగే ప్రయోజనాలను,పంట నష్టం జరిగినప్పుడు క్లెయిమ్ పొందే విధానాన్ని వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ



అధికారి పి. వెంకట నరసయ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు షరీఫ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్క్రూటిని పేరుతో నామినేషన్లు ఎలా తిరస్కరిస్తారు

వైకాపా పల్నాడు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు జి.మట్టారెడ్డి

పిడుగురాళ్ల.నవంబర్ 25రాజధాని వాయిస్ : రిటర్నింగ్ అధికారులు ఇచ్చిన చెక్‌లిస్ట్‌లో అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించి,సంతకం చేసి ఇచ్చిన తర్వాత స్క్రూటినీ పేరుతో నామినేషన్లను ఎలా తిరస్కరిస్తారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోషల్ మీడియా పల్నాడు ప్రెసిడెంటు,మాజీ ఎంపిటిసి గొట్టిముక్కల మట్టారెడ్డి ప్రశ్నించారు.గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి న్యాయస్థానాలపై ఉన్న గౌరవంతో హైకోర్టును ఆశ్రయించి, పోలీస్ ప్రొటెక్షన్ ఆర్డర్ తీసుకొచ్చి 34 గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలయ్యేలా న్యాయ పోరాటం చేశారని,ఎన్నికలు జరిగితే ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో ఘోరంగా ఓడిపోతామనే భయంతోనే కూటమి నాయకులు స్క్రూటినీని అడ్డుపెట్టుకుని ఏకగ్రీవాలకు ప్రయత్నిస్తున్నారా, ఇలాంటి చర్యలకు సహకరిస్తున్న అధికారులు చట్టాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల వ్యయ నిఘాను కట్టుదిట్టం చేయాలి

ఎన్‌టీఆర్ జిల్లా, రాజధాని వాయిస్: : ఎన్నికల సమయంలో అక్రమ నగదు, మద్యం, కానుకల పంపిణీని అరికట్టేందుకు ఎన్నికల వ్యయ నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ఎన్‌టీఆర్ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ మేరకు వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అకౌంటింగ్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాల పనితీరును పరిశీలించారు.ఎన్నికల వ్యయంపై నిరంతరం నిఘా ఉంచుతూ ప్రతి బృందం సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నగదు, మద్యం, కానుకలు వంటి నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, పంపిణీని అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ (FST), స్టాటిక్ సర్వైలెన్స్ (SST) బృందాలు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.



ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాల ని ఎన్నికల వ్యయ పరిశీలకులు బి. విజయ కుమార్ ఆదేశించారు.

పంచాయతీ ఎన్నికల వేళ జిల్లావ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు

తిరుపతి, రాజధాని వాయిస్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా పోలీస్ శాఖ వెల్లడించింది. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన భద్రతా చర్యలపై దృష్టి సారించింది.జిల్లా వ్యాప్తంగా ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ శాఖ తెలిపింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా పరంగా అవసరమైన చర్యలను విస్తృతంగా చేపట్టింది. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పించడంపై దృష్టి పెట్టింది. పోలింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా వ్యాప్తంగా భద్రతా ఏర్పాట్లను విస్తరించినట్లు పోలీస్ శాఖ పేర్కొంది. పోలింగ్ కేంద్రాల పరిధిలో



పటిష్ట బందోబస్తు ద్వారా ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు తలెత్తకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటర్లు నిర్భయంగా పాల్గొనే వాతావరణం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ తిరుపతి జిల్లా పోలీస్ శాఖ భద్రతా చర్యలను చేపట్టింది. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఉండేలా ఏర్పాట్లు చేసినట్లు నవంబర్ 25న విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

ఎన్నికల భద్రతలో అప్రమత్తత, సమన్వయం తప్పనిసరి

పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ జగదీష్ ఆదహళ్లి దిశానిర్దేశం

పల్నాడు, రాజధాని వాయిస్:: ఎన్నికల విధుల్లో ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదహళ్లి ఐపీఎస్ ఆదేశించారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు. నరసరావుపేట మున్సిపాలిటీ పరిధిలో చైర్‌పర్సన్, 46 వార్డులకు, నరసరావుపేట సబ్‌డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో 101 పంచాయతీలకు సంబంధించి 915 వార్డులకు నవంబర్ 26న జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ చేపట్టిన భద్రతా ఏర్పాట్లపై బుధవారం నరసరావుపేటలోని కోడెల శివప్రసాద్ క్రీడా ప్రాంగణంలో పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలు, రూట్లు, సమస్యాత్మక ప్రాంతాలు, విధుల పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 100 మీటర్ల పరిధిని స్పష్టంగా గుర్తించి, అనుమతి లేని వ్యక్తులు, వాహనాలను లోపలికి అనుమతించరాదని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌ను నిర్దేశిత పరిధికి వెలుపల ఏర్పాటు చేయాలని, 200 మీటర్ల పరిధిలో ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రచారం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు అవకాశం లేకుండా పర్యవేక్షించాలన్నారు.మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, రూట్ మొబైల్ సిబ్బంది తమకు కేటాయించిన మార్గాల్లో నిరంతరం పర్యటిస్తూ సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు. అవసరమైన చోట సైరన్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ప్రజలకు సూచనలు చేస్తూ పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు.ఎన్నికల విధులకు



హాజరయ్యే ప్రతి పోలీసు సిబ్బంది చక్కగా యూనిఫాం ధరించి, లాఠీ, విజిల్‌తో పాటు అత్యవసర సంప్రదింపు నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లను క్రమబద్ధమైన క్యూ లైన్లలో పంపిస్తూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురాకుండా ఓటర్లకు సహకరించాలని పేర్కొన్నారు.అమల్లో ఉన్న ఎన్నికల నియమావళితో పాటు పోలీసు యాక్ట్ 30, సెక్షన్ 163 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ఎక్కడా గుంపులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సిబ్బంది, పోలింగ్ సామగ్రి, ఈవీఎంల తరలింపునకు తగిన భద్రత కల్పించాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా నిరంతర నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు.ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పిస్తూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిఎస్పీ జగదీష్ ఆదహళ్లి ఆదేశించారు.

అంతర్జాతీయ వేదికపై గుంటూరు మేయర్ లక్ష్మీ అపర్ణ

- ప్రపంచ మేయర్ల సదస్సులో నగరానికి ప్రాతినిధ్యం

గుంటూరు, రాజధాని వాయిస్: : అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రపంచ మేయర్ల సదస్సులో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ పాల్గొన్నారు. ముంబైలోని హోటల్ ఫెయిర్‌మాంట్‌లో నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ మేయర్ల సదస్సు (3rd World Mayorsμ Forum), 7వ ఆసియా నగరాల సదస్సు (7th Asian Cities Summit 2026)లో ఆమె గుంటూరు నగరానికి ప్రాతినిధ్యం వహించారు. కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భాగస్వామ్యంతో, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి దేశ, విదేశాలకు చెందిన వివిధ నగరాల మేయర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణాభివృద్ధి రంగ నిపుణులు హాజరయ్యారు.ఈ సదస్సులో పట్టణ పాలనలో నూతన విధానాలు, ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, సుస్థిర నగరాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించడం వంటి కీలక అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. పట్టణాల అభివృద్ధికి అనుసరించాల్సిన ఉత్తమ విధానాలు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నగరాలను తీర్చిదిద్దే



అంశాలపై అంతర్జాతీయ ప్రతినిధులు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.గుంటూరు నగర మేయర్‌గా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కోవెలమూడి లక్ష్మీ అపర్ణ అంతర్జాతీయ స్థాయి సదస్సులో పాల్గొని నగరానికి ప్రాతినిధ్యం వహించడం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సదస్సు ద్వారా అంతర్జాతీయ పట్టణాభివృద్ధి విధానాలు, ఆధునిక నగర పాలనలో అనుసరిస్తున్న పద్ధతులపై అవగాహన పొందే అవకాశం కలగనుంది.

కొండపల్లి బొమ్మల కళకు పూర్వవైభవం

420 మంది కళాకారులకు మెరుగైన ఉపాధి, ఆదాయ అవకాశాలు
నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకుల కార్యక్రమం కింద రూ.20 లక్షల ప్రాజెక్టుకు ఆమోదం

ఎన్‌టీఆర్ జిల్లా, రాజధాని వాయిస్: : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కొండపల్లి సంప్రదాయ చెక్కబొమ్మల కళకు పూర్వవైభవం తీసుకురావడంతో పాటు కళాకారులకు మెరుగైన ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, ఐఏఎస్ తెలిపారు. నీతి ఆయోగ్ ఆకాంక్షిత బ్లాకుల అభివృద్ధి కార్యక్రమం (ABP) కింద రూ. 20 లక్షల ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని, దీని ద్వారా సుమారు 420 మంది కళాకారులకు ప్రయోజనం చేకూరనుందని వెల్లడించారు.ఈ నేపథ్యంలో కలెక్టర్ కొండపల్లి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను సందర్శించి అక్కడి కళాకారులు తయారు చేస్తున్న సంప్రదాయ చెక్కబొమ్మలను, వారి నైపుణ్యాలను పరిశీలించారు. తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను మరింత అభివృద్ధి చేసి, కళాకారులకు స్థిరమైన ఆదాయ మార్గాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.కొండపల్లి బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రత్యేక బ్రాండింగ్, పర్యావరణహిత ప్యాకేజింగ్



విధానాలను అమలు చేయాలని సూచించారు. అదేవిధంగా డిజిటల్ మార్కెటింగ్, ఆన్‌లైన్ విక్రయాలు, మార్కెట్ అనుసంధానం ద్వారా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com